# ఎదిగిన మనసు

సుమ






తొమ్మిదికల్లా కాఫీ, స్నానం వగైరా కార్యక్రమాలు ముగించుకొని పేపరుతో కటకటాల వరండాలో వాలుకుర్చీ నాశ్రయించడం గోపాలం అలవాటు. ఆ తర్వాత అర్ధ ముప్పావుగంట వరకూ అరుణ పరిభాషలో ఏం ముంచుకొచ్చినా, పేపర్ని వదిలేదిలేదు, దానిలో ఒక్క అక్షరంముక్క విడిచిపెట్టేది లేదు.

ఇవాళ అందుకు భిన్నంగా ఏమీ జరగలేదు గాని పేపర్లో ఒక్క వార్త బుర్రకెక్కడం లేదు. అక్షరాలేమిటో గజిబిజిగా, వార్తలన్నీ గందరగోళంగా అనిపిస్తున్నాయి. ఏ చిన్న అలికిడికీ, వారించినా వినకుండా చూపులు గేటుమీదకే పరిగెడుతున్నాయి.

సెకండ్లు, నిముషాలు వేడితగిలిన వెన్నలా కరిగిపోతుండగానే గోడ గడియారం తొమ్మిదిన్నరకు సూచనగా ఒకగంట పలికింది.

లోపలనుంచి సుషమ బుక్స్ చేతబట్టుకొని హడావుడిగా వచ్చి, చెప్పులు తొడుక్కొని "డాడీ! వెళ్ళొస్తా" అంటూ చెప్పి కాలేజీకి వెళ్ళిపోయింది.

కూతురినేదో అడగాలనీ, అడగలేక అసందిగ్ధంగా చూస్తుండిపోయేడు గోపాలం. చిన్న నిట్టూర్పు అతడి గుండెలనుండి దూసుకొని బయటకు వచ్చింది. 'ఇంకరాదు ఆ పిల్ల' నిర్ధారణగా అనుకొన్నాడు. ఎందుకో దిగులుగా అనిపించింది ఆ ఆలోచనకు.

బాణపుదెబ్బ తిన్న పిట్టలా విల విలలాడే చూపులతో, తుపాను గాలికి మొక్క నంటిపెట్టుకొన్న వణికే పువ్వులాంటి పెదవులతో, ముఖం అవమానం వలన ఎర్రగా కందిపోగా, ఉబికి వస్తోన్న కన్నీళ్ళు నిగ్రహించుకొంటూ మరి నిలబడలేక వెనుదిరిగి పరుగులాంటి నడకతో వెళ్ళిపోయిన రమణి రూపు కళ్ళముందు నిలవగా మనసు కలతబారినట్లయింది.

కాలానుగుణంగా సామాజిక పరిస్థితులు, విలువలు మారుతోన్న స్త్రీ భావాల్లో, అభిప్రాయాల్లో, మార్పులేకపోవడం ఎంత అసహజం? స్త్రీ అయి సాటి ఆడదాని బలహీన పరిస్థితికి సానుభూతి చూపకపోగా చులకనతో నిరసించడం ఎంత అవివేకం? తల్లి నైతికంగా పతనమైతే బిడ్డనూ ఆ బాపతుగానే తలచి ఈసడించడం ఎంత మూర్ఖత్వం?

తెలిసీ ఎదుట మనిషిని మాటలతో గాయపరచడం కంటె సంస్కార హీనమైన పని ఏదీ లేదని అతడి నమ్మకం. అదే చేసిందిప్పుడు అరుణ. పదిరోజుల నుంచి చూస్తూనే వున్నాడు. అమాయకత్వం గూడుకట్టుకొన్న అపరంజి బొమ్మలాంటి రమణిని. సుషమకోసం వచ్చేది. ఇక్కడనుండి ఇద్దరూ కలసి కాలేజికి వెళ్ళేవాళ్ళు.

వచ్చీరాని వయసుతో, ఎదిగీ ఎదగని శరీరాన్ని ఓణీతో కప్పుకొని, స్వచ్ఛంగా కడిగిన ముత్యంలా మెరిసే ముఖంతో ఎంతో అమాయకంగా కనిపించేది. చిన్న ఎర్రని బొట్టు తప్ప ఏ అలంకరణ లేని పొందికైన ఆ తీరు అతడికెందుకో ముచ్చటగా అనిపించేది. ఎంత పేపరులో మునిగిపోయినా, ఒక్కసారైనా తలెత్తి ఆ పిల్లను చూడకుండా వుండలేక పోయేవాడు. ఎందుకో తనకేదో తెలియని అభిమానంతో.

"లోపలకెళ్ళమ్మా! సుషమ ఇంకా తెమిలినట్లు లేదు." అనేవాడు.

"ఫరవాలేదు లెండి." అంటూ వరండా అంచునే నిలబడి నేలచూపులు చూస్తూనే, అటు తిరిగి ఆవరణలో పూలమొక్కల్ని పరికిస్తూనో పుస్తకాలు గుండెల కానించుకొని బిడియంగా ఒదిగినట్లు నిలబడిపోయేది.

ఆడపిల్లల ఆ తీరుపట్ల అతడెందుకో అమితంగా ముగ్ధుడవు తుంటాడు. ఇప్పటి పిల్లల పోకడే వేరు.

పద్దెనిమిదేళ్ళొచ్చినా పమిటతో గుండెలు కప్పుకోవడం నామోషీ. తల్లులకూ చిన్నతనమే కాబోలు వయసొచ్చినా ఓణీలు మాత్రం కొనరు కూతుళ్ళకు. వీధిలో కుర్రాళ్ళ చూపులన్నీ ఫ్రీగా అమ్మాయి ఒంటిని తడుముతుంటాయని, ఎంతటి మగవాడు, వయసొచ్చినా ఒళ్ళుదాచుకోని ఆడపిల్లని చూస్తే పిలిచినట్లు నిలబడిపోతాడని ఆడపిల్లలకీ, పిల్లల్ని కన్న తల్లులకీ తెలియదుకాబోలు.

ఇక అనర్థాలకు కొదవేముంది?.

సుషమను సాంప్రదాయకంగా పెంచడం పట్ల కల ఇష్టాన్ని అరుణకిష్టం లేకపోయినా సూచిస్తూనే వుంటాడు గోపాలం. ఆడపిల్లకి రక్షణలేని ఈ కాలంలో కనీసం పెద్దవాళ్ళు అయినా కొంత జాగ్రత్త తీసుకోవడం మంచిదని అతడి అభిప్రాయం కూడా.

రమణిరాక ఇటీవల నుండే అయినా, వంట పనుల వలన అంత తీరుబాటుగా ఆ పిల్లను చూసే అవకాశం అరుణకు కలగలేదు ఆ రోజు వరకు.

పని తెమలడంతో సుషమ వెనకే వరండాలోకి వచ్చిన అరుణ, అప్పుడే నిశితంగా చూసింది రమణిని.

అంత ఖరీదుకాని పచ్చని పూలున్న పసుపు రంగు పరికిణీ, జాకెట్టుమీద సాదావాయిలు ఓణీ పొందిగ్గా వేసుకొనివుంది. ప్రత్యేకించిన అలంకరణ గాని, ఆభరణాలు గాని లేవు. ముఖం మాత్రం నీరెండకు మెరిసే మంచు బిందువులా వుంది. బిగుతుగా వేసుకొన్న జడలో రెండు బొండు మల్లెలు తురమబడ్డాయి.

ఆ పిల్ల వైఖరిలో అంత డాబూ, దర్పం లేకపోవడం ఆమె నాకర్షించ లేదుకాబోలు అతి సహజంగా. యథాలాపంగా అడిగినట్లు అంది.

"నువ్వూ జూనియర్ ఇంటరేనా?" సుషమ కంటె ఒకటి రెండేళ్ళు పెద్దదే కావచ్చు రమణి.

"కాదండీ. సీనియర్ ఇంటర్ చదువుతున్నాను."

"మీ ఇల్లెక్కడేమిటి?"

"ఈ వీధిలోనే"

"మీ నాన్నగారేం చేస్తుంటారేం?" అదే నిర్లక్ష్యం. ఈసారి సమాధానం లేదు.

కొద్దిగా ఆశ్చర్యంతో పేపర్నుండి దృష్టి మరలించేడు గోపాలం.

తల దించుకొని క్రింది పెదవి పంటితో నొక్కిపెడుతూ నిలబడిపోయింది రమణి.

సుషమే అంది స్నేహితురాలి తరపున వకాల్తా పుచ్చుకొన్నట్లు.

"రమణికి నాన్నగారు లేరమ్మా!"

"అరె, పాపం. పోయారా?" ఈసారి సానుభూతి చూపించింది అరుణ. గోపాలం నొచ్చుకొన్నట్లు చూసేడు.

అంతలోనే సుషమ శ్రోతలిద్దరూ చకితులయ్యే మరో వార్త చెప్పింది.

"పోవడం కాదమ్మా! అసలు రమణి వాళ్ళమ్మగారికి పెళ్ళే కాలేదట!" విస్తుపోయి చూసేరు ఇద్దరూ. ముందుగా అరుణే తేరుకొంది.

"ఏవిటీ? అయితే మీరు సుబ్బమ్మగారింట్లో కొత్తగా అద్దెకు దిగేరు కదూ? మీ అమ్మ మిషను కుడుతుంటుంది. అవునా?" అంది ఆరాగా.

"అవునండీ" బిక్కచచ్చిపోతూనే సమాధానమిచ్చింది.

ఒక్కసారిగా అరుణ ముఖంలో గొప్ప మార్పు వచ్చేసింది. ఇంత వేప్పూతో, పచ్చికాకరకాయో నమిలినంత వికారంగా ముఖం పెట్టి చూస్తూ, నిరసనతో అంది.

"ఓహో! అయితే మీరేనన్నమాట! మీ అమ్మ గురించి నేనూ విన్నాన్లే. ఆ సుబ్బమ్మ అద్దె ఎక్కువొస్తుందన్న ఆశతో మంచి చెడ్డా లేకుండా మీలాంటివాళ్ళకిచ్చిందని నలుగురూ అనుకొంటూనే వున్నారు. పెళ్ళిపెటాకులు లేకుండానే తల్లయి, పైగా ఎంత ధైర్యంతో పెంచుకొస్తుందో? అయినా పెళ్ళి కాకుండానే బరితెగించిన దానికి కడుపవుతుందిగాని, పెళ్ళవుతుందా? ఇంకా నయమే ఇప్పటికయినా తెలిసింది మాకు. కాని నువ్విలా సంసార్ల ఇళ్ళకు రావడం, మా పిల్లతో కలసి తిరగడం మాకు మర్యాద కాదమ్మాయ్. ఇంకెప్పుడూ మా పిల్ల జోలికి రామాకు. నేనింకా ఏమిటో అనుకొన్నాను నీ వాలకం చూసి ఎలాంటి వాళ్ళనయినా భరించవచ్చు గాని, నీతీ జాతీ లేని వాళ్ళను మాత్రం దగ్గరకు కూడా రానివ్వకూడదు.' అంటూ నాలుగూ దులిపేసింది.

తర్వాత సుషమ వైపు తిరిగి, "మొద్దూ నీకెక్కడ దొరికిందే ఈ స్నేహం? పైగా వాళ్ళమ్మకు పెళ్ళి కాలేదూ అని చెబుతావూ? 'ఒళ్ళూపై తెలీకుండా తిరిగుంటుంది. ఇంక పెళ్ళెట్లా అవుతుంది? అయినా ఏదో సామెత చెప్పినట్లు ఇంకెదుకట పెళ్ళి?" అంటూ సాగదీసింది విచక్షణ మరచి.

నిర్ఘాంతపోయేడు గోపాలం. సుషమ బిక్కముఖం పెట్టుకొంది.

అవమానంతో ఎర్రని మోదుగపూవైన ముఖంతో, కళ్ళనిండుగా నిలిచిన కన్నీళ్ళు జారిపడబోతుండగా, గిరుక్కున వెనుదిరిగి పరుగు లాంటి నడకతో గబగబ వెళ్ళిపోతోన్నరమణిని చూస్తుంటే, అతడిలో రక్తం ఒక్కసారిగా వెనక్కితిరిగిబడి వేగంగా ప్రవహించినట్లు, ఒళ్ళంతా ఏదో ఆవేశంతో కంపించింది.

"ఛీ! ఏం పని చేసేవు అరుణా! అమాయకమైన ఆ పిల్లను తల్లి వంకన అన్నన్ని మాటలతో అవమానించడం సంస్కారం కాదు. ఆ తల్లి ఎటువంటిదైతేనేం? ఆ పిల్ల ముఖం చూసీ ఆ మాటెలా అనగలిగేవు? ఎంత బాదపడుతూ వెళ్ళిపోయిందో చూడు."

"చాల్లెండి, నేనేం కానిమాటలన్లేదు. అయినా మీకేం తెలుసని ఆవిడ గురించి? అందరూ ముక్కున వేలేసుకొంటున్నారు, ఎంత బరితెగించినది కాకపోతే పెళ్ళి కాకుండానే తల్లి అయి, ఆ పిల్లని పెంచుకొస్తుందని! తల్లి అటువంటిదైతే పిల్ల గట్టున మేస్తుందని నమ్మకం ఏమిటి? అమాయకంగా కనిపించడానికేం? ఇటువంటివాళ్ళు ఎన్ని వేషాలైనా వేయగలరు. మన పిల్లను దూరంగా ఉంచడం మనకు శ్రేయస్కరం గాని కలసితిరగనివ్వడం ఏం బాగుంది? మంచేమిటో, చెడేమిటో తెలియజెప్పడం తప్పేం కాదు."

ఉవ్వెత్తునలేచిన అలలు తీరం చేరకుండానే అడ్డునిలిచిన పెద్ద బండరాళ్ళను ఢీకొని విరిగి వెనక్కి ఒరిగిపోయినట్లనిపించింది అతడి కోపం. అరుణకు నచ్చజెప్పడం మానవమాత్రుడి వలన అయేపని కాదు.

అనుకోని అవమానానికి కమిలిపోయిన రమణి ముఖం కళ్ళముందు నిలిచి, అప్పుడప్పుడు కలవరపరచేది అతడిని.

కాలం ఎంతటి గాయాన్నీ కబళించగలదు అనడానికి ఋజువేమీ అక్కర్లేదు!

సుషమ ఒక్కత్తే కాలేజికి వెళ్ళొస్తోంది. మళ్ళీ రమణి ఎప్పుడూ కనిపించలేదు. గోపాలం రెండు మూడు రోజులు చూసి 'తన పెరికాకపోతే ఏమిటి? ఎందుకొస్తుంది' అనుకొన్నాడు. క్రమంగా ఆ సంఘటన మరుగునపడిపోతోన్న దశలో, ఓ వారానికి కాబోలు అరుణ సుషమకు టిఫిన్ పెడుతూ ఉంది.

"మళ్ళీ ఆ పిల్ల నీతోగాని మాట్లాడుతుం దేమిటే? కాలేజికొస్తోందా అసలు?"

టిఫిన్ తినడం ఆపి అంది సుషమ. "రమణికి అప్పటినుండి ఒకటే జ్వరమట. కాలేజికి రావడం లేదు. 'నాన్న, నాన్న' అంటూ జ్వరంలో కలవరింతలట. వాళ్ళ అమ్మతో మాట్లాడటం మానేసిందట. ఆవిడ ఒకటే ఏడుపట?"

గడ్డం గీసుకొంటున్న గోపాలం ఉలిక్కి పడినట్లయేడు. లేచొచ్చి గుమ్మంలో నిలబడ్డాడు అలాగే.

"నీకెలా తెలుసు?" తీక్షణంగా చూస్తూ అంది అరుణ.

"మా ఫ్రెండ్స్ చెప్పేరు. తన దగ్గరకు వెళ్ళి చూసొచ్చేరట" తల్లిని కినుకగా చూస్తూ అంది సుషమ.

"మరి ఆ తల్లి చేసిన పని సామాన్యమైనది కనుకనా, ఆ పిల్ల బాధపడి జ్వరం తెచ్చుకోకుండా వుండటానికి! అసలు అటువంటి తల్లిని అసహ్యించుకోవడం ఒక్కటే సరియైన శిక్ష. లేకపోతే రేప్పొద్దున ఈ పిల్ల భవిష్యత్తు ఏమిటి అనే ఇంగితం ఉండక్కర్లా, కన్నతల్లి ఒళ్ళుపై తెలీకుండా తిరిగి ఇప్పుడు కూతురిని బాధపెట్టి, తను బాధపడి ప్రయోజనం ఏమిటి? సరేలే, చేసుకొన్నవాళ్ళకు చేసుకొన్నంత అని ఊరికే అనలేదు. మనకెందుకు వాళ్ళ పీడ. త్వరగా కానీయ్, కాలేజికి టైం అవుతోంది" అంటూ విషయం మార్చబోయింది.

కాని సుషమ ఊరుకోలేదు. పైగా నిందారోప ణగా అంది.

"డాక్టరుకు చూపిస్తే, రమణి మానసికంగా షాక్ తిన్నది, నెమ్మదిగా గాని కోలుకోలేదు అన్నారట. వీలైతే తండ్రిని చూపించగలగడం, లేకపోతే ఆమెపట్ల ఎంతో సహనం వహిస్తూ, నిజం తెలిపే ప్రయత్నం చేయడం మంచిదన్నా రట. రమణి తల్లితో."

లోట్రుపడినా పైకి సహనంగానే అంది అరుణ. "మరింకేం? తండ్రినే చూపించకపోయిందా?"

"ఇప్పుడెక్కడని చూపిస్తుందమ్మా! ఆవిడ అంటే, శ్రీలక్ష్మిగారు పుట్టింది పెరిగింది బందరు లోనేనట. చిన్నప్పటి నుండి ఆడిపాడిన, అభి మానించిన పక్కింటి అబ్బాయినే చివరకు ప్రేమిం చిందట. అతడూ చేసుకొంటానని మాటిచ్చేడట కాని తర్వాత...."

"నోర్మూయ్! భడవకానా! దానిస్నేహం పట్టేక పెద్దమాటలు కూడా నేర్చావు. నేను పూరికే అన్నానా ఆ పిల్ల స్నేహం కూడదని...." అంటూ ఎగిరిపడింది. అరుణ మధ్యలోనే.

ఎంతో శ్రద్ధగా వింటూ గుమ్మంలో నిలబడిన గోపాలం ముఖం సుషమ మాటలకు ఒక్కసారిగా వివర్ణమైంది. నెత్తినెవరో ఇనుపకడ్డీతో మోదినట్లు కళ్ళు తిరిగినట్లు అనిపించేయి అతడికి.

చెవుల్లో సముద్రపుహోరు! గుండెల్లో పిడుగు పాటు!

సుషమ కోపం దిగమింగుతూ "రమణి వాళ్ళమ్మ ఏడుస్తూ ఎవరితోనో చెబుతోంటే, మా ఫ్రెండు విన్నాదట." అంటోంది.

"చూసేరా వీళ్ళ కబుర్లు? నేను కానిమాట లన్నట్లు మీరేదో ఇదయిపోయేరు మధ్యన...." అంటూ అటు తిరిగిన అరుణకు గుమ్మంలో గోపాలం కనపడలేదు.

అతడు బట్టలు వేసుకొని బయటకు నడిచేడు.

తల దిమ్మెక్కినట్లు మనసంతా గడ్డకట్టినట్లు అనిపిస్తుంది.

అడుగులు ఎటుపడున్నాయో! తనేం ఆలోచిస్తు న్నాడో అవగాహనకు అందడం లేదు.

అతడి గుండెల్లో శ్రీలక్ష్మి పేరే మారుమ్రోగు తోంది.

శ్రీలక్ష్మి! ఎలా మరచిపోయేడు తనని!

పల్చని చెక్కిళ్ళు, అరవిరిసిన గులాబీవంటి పెదవులు. పదునుతేరిన ముక్కు. రమణిని చూసే కైనా ఆమె స్ఫురించలేదేం? ఎంత విచిత్రం తను శ్రీలక్ష్మిని మరచిపోగలగడం?

బందరు రామానాయుడి పేటలో తమ డాబా ప్రక్కనే శ్రీలక్ష్మివాళ్ళ మండువా ఇల్లు.

తమకు ఊహ తెలిసేనాటికే రెండు కుటుంబాల మధ్య స్నేహం వుంది. చనువూ వుంది. శ్రీలక్ష్మి, తను కలిసే బడికి వెళ్ళేవాళ్ళు చిన్నతనంలో.

అప్పట్లో కార్తీక, మాఘ పౌర్ణమి రోజులొస్తే ఎంత సందడో? మంగినపూడిలో సముద్రస్నానం చేసి, అక్కడనుండి చిలకలపూడి పాండురంగడి గుడికి వెళ్ళేవాళ్ళు. చుట్టూ వున్న చిన్న చిన్న గుళ్ళు చూస్తూ పరుగులీసేవాళ్ళు శ్రీలక్ష్మి, తనూ. కోనేటి మెట్ల మీద కూర్చుని కబుర్లు చెప్పుకోవడం, మొగలిదొంకల్ని చూడటంతోనే పొద్దు సరిపోయేది. అప్పటికి పూజలు ముగించుకొని తిరుగుప్రయాణానికి సిద్ధమయ్యేవాళ్ళు పెద్దవాళ్ళు.

తిరిగొచ్చే బస్సులు దొరక్క, వాటికోసం నిలబడలేక నెమ్మదిగా కబుర్లు చెప్పుకొంటూ ఇళ్ళకు చేరుకొనేవారంతా. ఎంత సరదా అప్పుడు.

శ్రీ లక్ష్మితండ్రి పోవడం కూడా గుర్తే బాగా.

దినవారాలయ్యేక మేనమామ ఏడ్చి సొమ్మసిల్లి పోయే చెల్లెల్ని, పిల్లలతో తీసుకొని వెళ్ళిపోతా నంటే ఆమె ఒప్పుకోలేదు. ఇద్దరి పిల్లలతో వచ్చి బరువుమోపడం ఇష్టం లేదన్నది. పంటమీదొచ్చే డబ్బుతో ఎలాగో బ్రతకలేకపోము అన్నది.

అప్పుడు ఎంత భయపడ్డాడు తను? నిజంగా శ్రీలక్ష్మివాళ్ళు వెళ్ళిపోతారేమోనని! ఇంకెప్పుడూ శ్రీలక్ష్మి తనకు కనిపించదేమోనని!

అంతవరకూ అంతటి అభిమానం శ్రీలక్ష్మిపట్ల తనలో ఉన్నదని తనకే తెలియదు. తర్వాత ఆ మాట శ్రీలక్ష్మితో చెప్పుకొన్నాడు. తను నవ్వింది తలవాల్చుకొని.

కాని వయసొచ్చేక ఏదో అడ్డుగోడలు ఇద్దరి మధ్య పుట్టగొడుగుల్లా లేచేయనిపించింది.

ఓణీల్లో ఒదిగిపోయే శ్రీలక్ష్మి చదువు మానే సింది. తను కనిపిస్తే ఇదివరకులా మాట్లాదేదికాదు. తప్పుకొని వెళ్ళిపోయేది.

తనకెంత ఆరాటంగా వుండేదప్పుడు. ఎంత కోపంగా వుండేది. 'మాట్లాడితే ఏం పోయిందట' అనుకొని తిట్టుకొనేవాడు.

శ్రీలక్ష్మిని పిలిచి అడగాలనిపించేది. కాని ఏవో తెరలుపల్చగా. జీవితంలో మరపురాని ఒక రోజు ఉంది. తన బలహీనత మీద దెబ్బకొట్టిన రోజది!

ఆ రోజు ఇంట్లో హడావుడి! అక్కయ్య అత్తింటి బంధువులందరూ వచ్చి వున్నారు, అక్కయ్య కొడుకు బారసాలకుగాను. తనకు ఊపిరి తీసుకోను కష్టంగా వుంది ఇంట్లో. ఎవ్వైనా

వెళదాం అనుకొనే బయలుదేరేడు పొద్దుపోయేక.

వాకిట్లో ఎదురయింది శ్రీలక్ష్మి. అంతకు రెండు రోజులు ముందు శ్రీలక్ష్మి తల్లి పొలం పని మీద పల్లెకు వెళ్ళింది, కొడుకును తీసుకొని. వెళ్ళే ముందు అమ్మ, 'ఏం ఫరవాలేదు మేం ఉన్నాముగా!' అంటూ భరోసా ఇచ్చి పంపింది.

హడావుడివలన ఇంట్లో వాళ్ళెవరూ వీధివాకిలి వైపు లేరు.

"ఏవిటి శ్రీలక్ష్మి! ఏం కావాలి?" ఆదుర్దాగా అడిగాడు.

"మా ఇంట్లో కరెంటు లేదు. నాకు భయంగా వుంటే...." బెరుగ్గా అంది.

"అరె, మాకుందే. ఫ్యూజ్ పోయిందేమో. చూద్దాం పద." చనువుగా అంటూ వాళ్ళ వాకిలి వైపు దారి తీసేడు.

దీపం వెలిగించి తెచ్చింది శ్రీలక్ష్మి.

శ్రీలక్ష్మి దీపంబుడ్డి పైకెత్తి పట్టుకొని నిలబడితే, కావాలనే చాలాసేపు ఏదో సరిచేసినట్లు చేస్తూ ఫ్యూజ్ వేసేడు, తను స్టూలు మీద నిలబడి.

అంతవరకూ ఓరగా చూస్తూ, మాట్లాడుతూనే వున్నాడు. "ఏం నేను కనిపిస్తేనే మాట్లాడకుండా పారిపోతావ్? నేనేం రాక్షసుడిలా కనిపిస్తున్నానా?"

ఎర్రగా కందిపోయిన ముఖంతో, ఏదో భయంతో బిగుసుకొని పోయినట్లు నిలబడిపోయింది శ్రీలక్ష్మి.

"నేనంటే ఇష్టం పోయిందా? కాని నాకు మాత్రం పోదు నువ్వంటే."

కొద్దిగా బాధ, కలవరం కలగలసిన చూపులు.

"నువ్వంటే నాకెంత ఇష్టమో ఎలా చెప్పను శ్రీలక్ష్మీ!" ఒణికే గొంతుకతో అన్నాడు ఆమె వైపు తిరిగి.

నవ్వింది శ్రీలక్ష్మి. అరవిడిన గులాబీ గుర్తొచ్చింది.

ఒక్కక్షణం అతడిలో ఏదో ఆలోచన కోడెనాగులా పైకి లేచింది.

గుండె వేగంగా కొట్టుకొంది. మళ్ళీ మళ్ళీ రాని అవకాశం!

ఫ్యూజ్ వేసేడు. స్టూలు దిగుతూనే శ్రీలక్ష్మి చేతిలో దీపం ఊదేసేడు. అంతా చీకటి.

చప్పున ఆమెను బంధించేడు రెండు చేతులతో ఉద్వేగంతో గుసగుసల గొంతుకతో అన్నాడు. "ప్లీజ్, నన్ను వారించకు. మళ్ళీ మనకు ఈ అవకాశం రాదు. మనం పెళ్ళి చేసుకొందాం. పెద్దవాళ్ళు కాదంటే పాండురంగడి గుడిలో పెళ్ళి చేసుకొందాం. నిజం. నా మీద నమ్మకం లేదా శ్రీ! నువ్వు....నువ్వంటే నాకెంత ఇష్టమో...."

ఆ తర్వాత ఏం జరిగిందో తెలియనంతగా ఒళ్ళు మరచిపోయేరు ఇద్దరూ. ఆ అనుభవం, తనకింతగా మరపుకొచ్చేయంటే తనెంత స్వార్థపరుడు? ఎంత అవకాశవాది?

తర్వాత శ్రీలక్ష్మికోసం చూసినా ఎక్కువగా కనిపించేదికాదు. అమ్మతో తను 'శ్రీలక్ష్మిని పెళ్ళి చేసుకొంటానని' చెప్పాలనుకొనేవాడు కాని ఏదో భయంతో నోరుపెగిలేదికాదు.

సెలవులయ్యేక హిందూ కాలేజికి అప్లై చేయబోతుంటే నాన్న విశాఖపట్టణంలో అన్నయ్య దగ్గర వుండి చదవడం మంచిదంటూ తనను అక్కడకు పంపే ఏర్పాట్లు చేసేరు.

ప్రాణం విలవిలలాడింది. మనసులో మాట చెప్పేయ్యాలని గుండె కొట్టుకొనేది. కాని ఏదో అడ్డు పడినట్లు అనుకొన్నది బయటకొచ్చేది కాదు.

శ్రీలక్ష్మికి కనిపించి, 'శెలవుల కొచ్చినప్పుడు మనం చిలకలపూడి వెళ్ళిపోయి పెళ్ళి చేసుకొందాం' అని ధైర్యం చెప్పాలనుకున్నాడు. అదీ వీలుపడలేదు.

వెళ్ళగానే తండ్రికి ఉత్తరం ద్వారా మనసులో విషయం చెప్పాలనుకొని దూరంగా వరండాలో నిలబడిన శ్రీలక్ష్మికి కళ్ళతోనే వీడ్కోలు చెప్పి విశాఖపట్టణం బయలుదేరి వెళ్ళిపోయేడు.

క్రొత్త వాతావరణం! ఇంట్లో, బయటా అంతా క్రొత్తే!

ఆ వాతావరణంలో ఇమిడేవరకూ తనేదో ఇబ్బందిగానే ఫీలయ్యేడు. తర్వాత చదువు, స్నేహితులు, షికార్లు క్షేమసమాచారాల తర్వాత ముఖ్యమైన విషయం అంటూ వ్రాయాలనుకొనేవాడు. కాని చేతిలో ఏదో ఒణుకు.

ఇక లాభంలేదు. శెలవుల్లో ఎవరికీ చెప్పకుండా శ్రీలక్ష్మి మెళ్ళో మూడు ముళ్ళు వేయడం ఒక్కటే పరిష్కారం అనుకొన్నాడు.

కాని కాలం అనుకోని మలుపు తిప్పింది తనని.

శెలవులకి తను బందరు వెళ్ళాలనుకొన్నంతలో అమ్మా, నాన్నే వచ్చేరు పని గట్టుకొని.

"పక్కింటి అత్తయ్య వాళ్ళు బావున్నారా అమ్మా?" అన్నాడు.

"బావుండకేం? శ్రీలక్ష్మికి పెళ్ళి అయింది. మేనమామ తీసుకెళ్ళి మంచి సంబంధం చూసి పెళ్ళి చేసేడట. ఆవిడ ఇక ఆ వూళ్ళో వుండలేనంటూ కొడుకును తీసుకొని వెళ్ళి తోడబుట్టినవాడి దగ్గరే వుండిపోయింది. ఇంటికి బేరం పెట్టేరు."

హతాశుడయ్యేడు. గుండెని ముక్కలు చేసిన బాధ!

ఎందుకిలా చేసింది శ్రీలక్ష్మి? పెద్దవాళ్ళ బలవంతమా? వాళ్ళను ప్రతిఘటించలేని బలహీనతా?

ఎన్ని రాత్రిళ్ళు నిశ్శబ్దంగా కన్నీరు ఒలికించేడో ఎవరికీ తెలియదు.

క్రమంగా కాలమే ఓదార్చింది తనని.

ఇన్నాళ్ళకుగాను మళ్ళీ శ్రీలక్ష్మి గతం తాలూకు తెరల్ని తప్పించుకొని ముందుకు రావడం యాదృచ్ఛికమే అయినా ఎంత ఆశ్చర్యం!

తనకు లక్షణంగా పెళ్ళి అయిందని విన్నాడు.

మరి ఈ అపవాదు ఏమిటి? పెళ్ళి కాకుండానే తల్లి అయిందనే నింద ఏమిటి? అర్థంకాలేదతడికి. చివరకు నిర్ధారించుకొన్నాడు, పలు గాకులైన లోకుల మాటల్లో నిజం ఎంతో నిష్ఠూరం ఎంతో ఎవరికి తెలుసు? కాని శ్రీలక్ష్మిని చూడాలనే బలమైన కోరికను మాత్రం నిగ్రహించుకోలేకపోయేడు.

ఎక్కడెక్కడ తిరిగేడో గుర్తులేదు. సాయంత్రానికి ఇల్లు చేరి, భోజనం అయిందనిపించేడు.

సుషమ చదువుకొంటోంది. అరుణ వంటింట్లో వుంది.

స్నేహితుడి పని మీద వెళుతున్నానని చెప్పి బయటపడ్డాడు. కొంతసేపు పార్కులో తిరిగేడు. తర్వాత పార్కు వెనక గేటునుండి శ్రీలక్ష్మి ఇంటి వైపు దారి తీసేడు.

ఇల్లు గుర్తుపట్టడం కష్టం కాదు. సుబ్బమ్మగారింట్లో అద్దెకు ఇచ్చే పోర్షను తనకు తెలుసు. కాకపోతే శ్రీలక్ష్మి, తను ఒకరినొకరు గుర్తుపట్టడమే కష్టసాధ్యం కావచ్చును.

నిశబ్దంతో నెమ్మదిగా తలుపు తట్టేడు. ఏదో ఉద్విగ్నత, సన్నగా కంపన.

"ఎవరూ?"

అది శ్రీలక్ష్మి గొంతే కావచ్చునేమో!

బయట లైటు వెలిగింది. తలుపులు తెరుచుకున్నాయి.

గుమ్మంలో శ్రీలక్ష్మి!

కొన్ని సంవత్సరాల క్రితం తనతో ఆడిపాడిన శ్రీలక్ష్మి! వయసొచ్చేక కేవలం మంచి గంధపు సువాసనలు వెదజల్లే మనసుతో మౌనంగా తనని ఉక్కిరిబిక్కిరి చేసిన శ్రీలక్ష్మి! కోడెనాగులా తనలో లేచిన కోరిక ఆమెని కాటేసినా తనని విలదీయని శ్రీలక్ష్మి!

విడిపోతేనేం ఎలా మరచిపోగలడు?

చిక్కని చెక్కిళ్ళు, రంగు తరిగిన శరీరం, నిస్తేజపు చూపులేమిగిలినా కోరికల్ని ఎలా మరచిపోగలడు?

"ఎవరూ? ఎవరికోసం?" అంటూనే పరికించి చూస్తోంది ఆమె.

"నేను గోపాలాన్ని మరచిపోయేవా?" నవ్వబోయినా పెదవులు సహకరించలేదు. ఎంత మామూలుగా పలకాలన్నా గొంతు కూడిరాలేదు.

శ్రీలక్ష్మి కొయ్యబారినట్లు చూచి, మరి నిలవలేనట్లు అక్కడే వున్న కుర్చీలో కూలబడి రెండు చేతుల్లో ముఖం దాచుకొంది.

అతడూ ఉబికివస్తోన్న దుఃఖాన్ని పళ్ళ బిగువున ఆపుకొన్నాడు.


కొన్ని నిముషాల నిశ్శబ్దంలో ఎవరికి వారు సంబాళించుకొన్నారు.

శ్రీలక్ష్మి లేచి నిలబడింది "రండి" అంటూ. అతడు లోపలకు వచ్చి ఎదట కుర్చీలో కూర్చొన్నాడు.

"మా అమ్మాయి సుషమ మీ రమణి ఫ్రెండ్సేనట ఈ రోజే తనవలన తెలిసింది మీ గురించి. రమణి మనసును నొప్పించింది మా ఆవిడే. అందుకు ఆమె తరపున నిన్ను క్షమాపణ కోరుతున్నాను శ్రీలక్ష్మి!"

విచిత్రమైన నవ్వు ఆమె పెదవుల మీద కదలాడింది పల్చగా.

"మా జీవితాలకది కొత్త కాదు. సంవత్సరాలుగా అవమానాల్నీ, అపహాస్యాల్నీ భరిస్తూనే వస్తున్నాం. మీవలనే జరిగింది అనుకోవడం భావ్యం కాదేమో!"



టొమాటోలు, కేరట్లు చూడడానికి ఎంతో అందంగా వుంటాయి. అంతేకాదు. వాటిలో పుష్కలంగా విటమిన్లూ, పోషకపదార్థాలూ వున్నాయి. వాటిని తరచూ తీసుకోడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. అదేవిధంగా టొమాటో రసాన్ని, కేరట్ రసాన్ని కలిపి ఆ మిశ్రమాన్ని అప్పుడప్పుడూ ముఖానికి పట్టించడం వల్ల ముఖానికి ఎంతో ఆకర్షణీయంగా వుంటుంది.

"అవమానాలేమిటి? నేను విశాఖపట్టణం వెళ్ళిపోయేక, నీకు పెళ్ళయిందని అమ్మ చెప్పగా విన్నాను. నువ్వంత తొందరగా మరో ఇంటిదానివై పోతావనుకోలేదు. మన ప్రేమ మన అనుబంధం అంత త్వరగా మరచిపోతావనుకోలేదు. అది పెద్దవాళ్ళ బలవంతంవలనేగాని, నీ ఇష్ట పూర్వకంగా జరిగింది మాత్రం కాదని నాకు తెలుసు. మరి ఈ నింద ఏమిటి?"

శ్రీలక్ష్మి అతడినే విశితంగా చూస్తూ ఏదో ఆలోచిస్తొన్నదానిలా వుండిపోయింది కొద్ది క్షణాలు అంతలోనే జాలి నవ్వు.

"హూఁ! కన్నెపిల్లగానే కన్నతల్లిని కానున్న నన్ను ఎవరంత ఉదారంగా, ఆదర్శప్రాయంగా పెళ్ళి చేసుకోగలరని ఆ మాట నమ్మేవు? కాళ్ళు పట్టుకొని ప్రాధేయపడినా మీ తలిదండ్రులే కాలదన్ని పొమ్మన్నారు. నువ్వు వెళ్ళేక ఒక్క కబురూ నాకు లేదు. నెలలు గడిచిపోతుంటే నట్టింట్లోనైనా తలెత్తుకొని తిరగలేనిదుస్థితితో కుమిలిపోతూనే పల్లెకు వెళ్ళిపోయేం. అక్కడా అవమానాలే, ప్రతిఘటనలే. గర్భం తీయించేస్తానంటే ఒప్పుకోలేదు నేను. అమ్మ కొట్టినా, ఎవరెన్ని అనినా భరించే తీరతానన్నాను పుట్టబోయే పాపని. అక్కడా ఎంతో కాలం నిలవలేకపోయేము. అమ్మతో, తమ్ముడుతో ఇక్కడ కొచ్చేము. మళ్ళీ అవమానాలకు, హేళనలకు బాధపడే రోజులు పోయేయి. అలవాటు పడిపోయేను అన్నింటికి కాని ఇప్పుడు నా బిడ్డ....నా రమణి....నన్నే అసహ్యించుకొంటుంటే నిలవలేకపోతున్నాను" కన్నీళ్ళతో ఆమె చెప్పినదంతా వింటోన్న గోపాలం నిస్తేజుడైపోయేడు. గుండె క్షణంపాటు లయ తప్పి వేగంగా కొట్టుకొన్నది. కళ్ళ నిండుగా పేరుకొన్న కన్నీరు.

ఎంత చిత్రం? అంటే రమణి....తన రక్తం పంచుకొని పుట్టిన తన కూతురా?

ఒక్కసారిగా అతడి ఒంట్లో రక్తం పొంగిన అనుభూతి. గుండెలు పొంగే ఆనందం. లేచి నిలబడ్డాడు.

"శ్రీలక్ష్మి! రమణి ఏది? రమణి........ నా కూతురేనా? ఆ చిన్నారి నా....నా బిడ్డేనా?" అతడి గొంతులో ఏదో ఉద్వేగం.

"పడుకొనివుంది. ఒక్కసారిగా మీరు కనిపిస్తే తట్టుకొనలేకపోవచ్చును. కూర్చోండి. అది లేచేక నెమ్మది మీద తెలియపరచుతాను. కాని ఈ విషయంలో మీరు ఆలోచించవలసినది చాలా వుంది. తొందరపడకండి. మా గురించి మీరు బాధపడి, మరొకరిని బాధపెట్టినా అది భావ్యం అనిపించుకోదు. నాది అలవాటయిపోయిన జీవితం. రమణి తప్ప మరెవరూ నాకు అక్కర్లేదు. దాని భవిష్యత్తు, దాని బ్రతుకే నాకు ముఖ్యం. నిదానంగా అయినా రమణికి నేను నాగతం వివరించి క్షమాపణ కోరుకోగలను. కాని మీరు?"

"శ్రీలక్ష్మి! దీని పర్యవసానం ఎటువంటిదైనా నేను భరించగలను. ఇది నీకోసం కాదు. నా రమణి కోసం. తనెవరో తెలియకుండానే తన మీద అభిమానం, అప్యాయత పెంచుకున్న నేను, నా రక్తం పంచుకొని పుట్టిన కూతురే అని తెలిసేక ఎలా పట్టనట్లు ఉండగలను? నాకు సాధ్యం కాదు."

శ్రీలక్ష్మి కళ్ళల్లో మంచి ముత్యాలు.

పక్క గదిలో అలికిడికి చప్పునలేచింది. "కూర్చోండి. రమణి లేచినట్లుంది. తనకు నెమ్మదిగా అసలు విషయం చెప్పే ప్రయత్నం చేసేక మిమ్మల్ని పరిచయం చేస్తే బావుంటుందనుకొంటున్నాను." అంటూ లోపలకు వెళ్ళింది.

గోపాలం మళ్ళీ కుర్చీనాశ్రయించేడు. అతడికి లోపల ఎంతో ఆరాటంగా వుంది. తనకు తెలిసిన రమణికి, తను అభిమానపడే రమణికి తను నాన్నగా పరిచయం కాబడటం ఎంత విచిత్రం? ఎంత

ఆనందం?

అరుణకు జరిగినదంతా చెప్పుకొంటాడు. క్షమాపణ కోరుకొంటాడు.

"మంచినీళ్ళివ్వనా రమా!"

"ఏం అక్కర్లేదు."

"నా తల్లి వికదూ? గ్లూకోజ్ వాటర్ తాగితే."

"ఛీ ఛీ! నీ చేత్తో, ఏదిచ్చినా తాగను. నువ్వు....నువ్వు ..."

గోపాలం మనసు కలుక్కుమంది.

"రమా! నీకొక్కటి చెప్పాలమ్మా. మీనాన్న గురించి నాకిప్పుడే తెలిసింది. అతడూ నిన్ను చూడాలని తహతహ లాడుతున్నాడు. నిన్ను నీ తండ్రికి అప్పగించేముందు మా ఇద్దరి గురించిన గతం నువ్వు తెలుసుకొంటే బావుంటుంది. నా గురించిన నిజం ఏమిటో నువ్వూ తెలుసుకో గలవు." "ఏమిటది?" గొంతులో ఆతృతో, వెక్కిరింతో తెలియడం లేదు.

"ఇంకాసిన్ని గ్లూకోజ్ నీళ్ళు తాగు."

స్థిమితపడిన తర్వాత శ్రీలక్ష్మి నెమ్మదిగా గతాన్ని తలపోస్తూ, కూతురికి చెప్పడం మొదలు పెట్టింది.

చిన్నతనంలో తాము ఆడిపాడిన రోజులు, అప్పట్లో అల్లుకొన్న అపురూపమైన స్నేహం, కాలక్రమంలో అనుబంధంగా మారి ఒకరిపట్ల మరొకరికి అనురాగాన్ని కలిగించడం, మూగగా మనసులు ముడిపెట్టుకొన్న ఆ వైనం – అన్నీ వివరిస్తోంది.

ఆ తర్వాత ఆ రాత్రి జరిగిన సంఘటనను ఎంతో క్లుప్తంగా వివరించింది. పర్యవసానం నెల తప్పడం!

ఆ పైన జరిగిన కథకు ఆమె చెబుతున్న తీరుకూ అతడి గుండెలు ద్రవీభవించాయి.

ప్రేమించడం తప్పుకాదు.

కోరిక తలెత్తడం నేరం కాదు.

దాని పర్యవసానం అసహజం కాదు.

కాని పరిస్థితులు అనుకూలించనప్పుడో పెద్దవాళ్ళు అడ్డు గోడలైనప్పుడో, అనుకోనివి సంభవించినప్పుడో ఈ లోకం సానుభూతి చూపకపోగా హేళనతో రాళ్ళు విసరడం ఎంత అమానుషత్వం? ఈసడించి వెలి వేయడం ఎంతటి రాక్షసత్వం?

అమాయకంగా నమ్మినందుకు శ్రీలక్ష్మి పొందిన అనుభవాలు, అవమానాలు ఎంతటి దారుణమైనవో, అప్పుడే తెలుసుకుంటున్నాడు గోపాలం. కళ్ళు చెమర్చేయి. ఆమెపట్ల తను చేసిన ఆలస్యం ఎంతటి విషమ పరిస్థితుల్ని సృష్టించిందో తెలుసుకుంటుంటే గుండె గడ్డకట్టినట్లవుతోంది అతడికి.

అత్యంత సాన్నిహిత్యం వుండి అనురాగం, ఆదరణ వుండి సంవత్సరాలుగా ఆత్మీయులై మెలిగిన అమ్మా నాన్న కూడా ఆమెపట్ల అంత ఘోరంగా ఎలా ప్రవర్తించగలిగారు? అన్నింటికీ అడ్డురాని కులం పెళ్ళికి పెద్ద అవరోధం అయిపోయిందా? కారకుడు కొడుకే అని తెలిసీ నిర్దాక్షిణ్యంగా ఆమెను నిరసించి పెళ్ళి అయిపోయిందంటూ తనతో చెప్పడం వెనక ఎంత దారుణం దాగి వున్నది.

సంవత్సరాలు కాలగతిలో కరిగిపోయేక మళ్ళీ ఇన్నాళ్ళకు అనుకోని పరిస్థితుల్లో ఊహించని విధంగా నాన్న ఎదురయ్యేడంటూ చెబుతోంది శ్రీలక్ష్మి కూతురికి.

నిటారుగా కూర్చుని అత్యంత శ్రద్ధగా ఆలకిస్తున్నాడు గోపాలం. అతడి గుండె పులకించింది. హృదయం పొంగింది.

తనకొక అక్కయ్య ఉన్నదని తెలిస్తే సుషమ నిజంగా ఎంతో సంతోషిస్తుంది. అదీ 'రమణే' అంటే ఆమె ఆనందానికి అవధులు వుండవు.

ఎప్పుడెప్పుడు రమణిని గుండెలకు హత్తుకుంటానా, నాన్నా! అని నోరారా పిలిపించుకుంటానా అనే తహతహతో ఎదురు చూస్తున్నాడతడు.

తండ్రి గురించి వినడంతో రమణి ముఖంలో చెలరేగే సంతోషపు కెరటాలను చూడలేకపోతున్నందుకు చింతించాడు.

తండ్రిగా తనుండగా ఇక లోకుల పలుకులకేమీ?

"నువ్వూ నాన్న కోసం ఆరాటపడుతున్నావు. అతడు నీ గురించి ఆతృత పడుతున్నాడు. మీ తండ్రీ కూతుళ్ళ అనుబంధాన్ని కాదనే హక్కు ఎవరికీలేదమ్మా! నువ్వెప్పుడు చూడాలనుకుంటే అప్పుడు ఆ క్షణంలో నేను అతడికి కబురంపిస్తాను చెప్పు. ఈ తల్లి మీద కోపం పోయిందా రమా! నీ కోసమే నిన్ను చూసుకునే ఆనందంగా బ్రతకగలుగుతోన్న తల్లిని ఇంకా క్షమించలేవా? నావలనే నీ బ్రతుకంత బాధలతో, వేదనలతో సతమవుతుందని నేనొప్పుకొంటున్నాను. కాని. ఎదురుతిరిగిన పరిస్థితులకు గాను...."

"అమ్మా!" రమణి అరచినట్లుగా అంది.

గోపాలం గబుక్కున లేచేడు. లోపలకు వెళదామనిపించే ఆతృతను అణచుకొంటూ నిలబడిపోయేడు అక్కడే.

"నన్ను క్షమించమ్మా" అంటూ భోరున ఏడుస్తోంది రమణి.

శ్రీలక్ష్మి ఓదారుస్తోంది. నెమ్మదిగా ఊరడిస్తోంది.

"నీకూ నాన్న వున్నాడు తల్లీ! నువ్వెప్పుడు తలిస్తే అప్పుడు పలికే మీ నాన్న నీ చెంతనే...."

"అమ్మా! ఇంక చెప్పకు. నేను వినలేనింక అతడిగురించి. నీలోని గొప్పతనాన్ని గుర్తించని మూర్ఖురాలిని. లోకం మాటలకు నీ మనసును గాయపెట్టిన పాపిష్ఠి దానిని. మోసానికి గురిఅయి, వంచనలకు బలిఅయినా, నీ బిడ్డకోసం అన్నీ ఆనందంగానే స్వీకరించిన మాతృ మూర్తిని నేనెంత అపార్థం చేసుకొన్నాను. లోకానికి భయపడి నెత్తుటి ముద్దగానో, పసికందుగానో నన్నే చెత్తకుండీకో అంకితం చెయ్యని నా తల్లిని నేనెన్ని మాటలన్నానూ. ఇంక నాన్న అంటున్నావే? అతడేవిధంగానాన్న? కేవలం చీకట్లో తలెత్తిన ఒక కోరికకే, ఒక అనుభవానికే అతడు నాకు తండ్రి అయిపోయాడనుకోవడం ఎంత అవివేకం? ప్రేమించిన పడతి పట్ల కనీస బాధ్యత కూడా లేని అతడిని నేను నాన్నగా అంగీకరించలేనమ్మా. కోరిక తీరడంతోనే బాధ్యత తీరిపోదు. మూడుముళ్ళు వేసి ఇంటికి తెచ్చుకోవడం తెలియని పెద్దమనిషిని, నిన్నింతగా అవమానాలకు, అవహేళనలకు గురి చేసిన ఆ మహానుభావుడిని నేను నాన్నా అని పిలవడం కంటె నాకు అవమానం కలిగించేది ఏదీ లేదమ్మా! నేనెందుకంత మూర్ఖంగా ఆ తండ్రి కోసం తపించేనోగాని, నాకిప్పుడెంతో సిగ్గుగా వుంది. మరింకెప్పుడూ అతడి మాట ఎత్తకు నాముందు. అతడు ఎదుటపడినా అసహ్యమేగాని అభిమానం కలగదు నాలో." రమణి గొంతు ఎంతో నిశ్చయంతో పలుకుతోంది.

శ్రీలక్ష్మి నోట మాట లేదు. తనని మించి ఎదిగిన కూతురి మాటలకు!

గోపాలం నెత్తురుచుక్కలేని పాలిపోయిన ముఖంతో మరి నిలబడలేక చీకటిలో కలిసిపోయేడు! □

Vamaluri Seeta Rama Sastry
WRITER
RAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM